చెరువు కాదు.. రోడ్డే!

- ప్రధాన రహదారిపై నిలుస్తున్న వర్షపు నీరు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



మల్లూరు బస్‌షెల్టర్ ఎదుట ప్రధాన రోడ్డుపై నిలిచి ఉన్న నీటిలోనుంచి వెళ్తున్న వాహనం

మంగపేట: వర్షాకాలం షురూ అయింది.. దీంతో వర్షాలు కురుస్తుండడంతో బీటీ రోడ్లపై వర్షపు నీరు నిలిచి ధ్వంసమవుతున్నాయి. అయితే పర్యవేక్షించాల్సిన ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కమలాపురం–మంగపేట మధ్య, మల్లూరు బస్‌షెల్టర్ ఎదుట, రమణక్కపేట, రాజుపేట గ్రామాల్లో ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై రెండు ఫీట్ల మేర వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ప్రధానంగా మల్లూరు, రమణక్కపేట ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు రోడ్డుకు ఎత్తులో ఉండటం, సైడ్ కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రోడ్డుపై ఆగిన నీటిలో వాహనాలు వెళ్లే క్రమంలో పాదచారులతో పాటు బస్‌షెల్టర్ వద్ద బస్సులు, ఆటోల కోసం వేసి ఉండే వారిపై బురద పడుతోంది. ఇక రాత్రి సమయంలో రోడ్డు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కువ రోజులు నీరు నిలవడంతో భరించలేని దుర్గంధం వస్తోంది. అలాగే బీటీ రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు రోడ్డుపై నీరు నిలిచి ఉండకుండా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డు ధ్వంసమవుతున్న అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసలు ఆ శాఖలో అధికారులు ఉన్నారా లేరా అని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రమణక్కపేటలో రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపునీరు

మొక్కలను బాధ్యతగా పెంచాలి


గ్రామస్తులకు మొక్కలను ఇస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం): మొక్కలను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందని లక్ష్మీదేవిపేట పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేటలో వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికి ఐదు మొక్కలను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలను పెంచుతూ వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నల్లబెల్లి భాస్కర్, కేతిరి రాధిక, నాయకులు కట్టికోళ్ల వెంకటేష్, చిర్ర గణేష్, రామకృష్ణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న జవహర్‌లాల్

వెంకటాపురం(ఎం): రైతు రుణాలను ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల వరకు మాఫీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు రూ.రెండు లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. ఒక కుటుంబంలో ఒక్కరికీ మాత్రమే రుణమాఫీ అంటూ, 2018 కటాఫ్ తేదీ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. రూ.రెండు లక్షల వరకు ఉన్న రుణాలన్నింటిని మాఫీ చేయాలని జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ నాయకులు పోశాల శంకర్, ధర్మరాజు, కిరణ్, విజయ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయుడు కర్ర రఘురాం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి గొంది దివాకర్ హాజరై మాట్లాడారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు కాసర్ల రమేష్, భానోత్ సూర్యంలు వృత్తి పరంగా ఎంతో నిబద్ధత కలిగిన వారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య, ఎస్ రాజు, లక్ష్మీ, వంట సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



వెంకటాపురం(కె): భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వీరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం మునేశ్వరావు, పూనెం సాయి, పూనెం ప్రతాప్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం, యామన్‌పల్లి ప్రధాన రహదారిలో గురువారం ఎస్సై మహేందర్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితులను విచారించి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్పీఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేయండి

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ స్కానింగ్‌తో పాటు ఇతర స్కానింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సౌకర్యాలు లేకపోవడం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్‌ల కోసం హనుమకొండ, వరంగల్‌లోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు వెళ్లి వేలాది రూపాయిలు ఖర్చు చేస్తున్నట్లు వాపోయారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

టేకుమట్ల: ఒకరు లేక ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుని కుటుంబ నియంత్రణ పాటించాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో ఆశ, ఏఎన్‌ఎం, యువ దంపతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కాన్పుకి, కాన్పుకి మధ్యలో ఎడ కోసం యువ దంపతులు గర్భస్థ నిరోధ సూత్రాలు పాటించాలన్నారు. ఒకరు లేదా ఇద్దరు పిల్లల తర్వాత ఆడవారు ట్యూబెక్టమీ, మగ వారు వేసెక్టమీ ఆపరేషన్లు చేపించుకుని కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధురిమ, హెచ్‌ఈఓ జమాలుద్దీన్, మెచ్‌వీ విజయ, ఫార్మాసిస్టు విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురువారం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశ్‌రెడ్డి వల్లెకుంట గ్రామానికి రెండు సార్లు సర్పంచ్‌గా, ఎంపీపీగా సేవలందించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌రెడ్డిని మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, మాజీ జెడ్పీటీసీ అయిత కొమల రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

రిటైర్మెంట్ ప్రక్రియ నిలిపి వేయాలి



దీక్ష వద్ద మాట్లాడుతున్న సమ్మక్క

ములుగు రూరల్: ప్రభుత్వం కొత్త జీఓను విడుదల చేసేంత వరకు అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్రక్రియను నిలిపి వేయాలని అంగన్‌వాడీల యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సమ్మక్క డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీలు జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1334 మెమో ప్రకారం 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ ప్రకటించి విధులకు హాజరు కాకుడదని తెలిపారని అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి ఇప్పిస్తామని ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉందని తెలిపారని జీఓ విడుదల అయ్యేంత వరకు అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రత్నం రాజేందర్, సరిత, సూరమ్మ, వెంటేశ్వరి, ధనలక్ష్మీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చిన్నచూపు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ములుగు రూరల్: విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి అన్నారు. విద్యార్థుల పెండిగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రియబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. గురువారం విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఉన్నత విద్యకు పేద, మధ్య తరగతి విద్యార్థులు దూరం కాకుండా జిల్లా కేంద్రంలో ఎస్సీ సెల్ఫ్‌మెనేజిమెంట్ హాస్టల్ ఏర్పాటు చేయాలని అన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులకు కళాశాల యజమానులు సర్టిఫికేట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సాదు రాకేష్, మోరె లక్ష్మణ్, రమేష్, మష్రాఫ్, సాయిచరణ్, శివ, మణికంఠ , విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజన విద్యార్థులకు చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకన్న

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలం రామన్నగూడెం, కన్నాయిగూడెం మండలం సింగారం గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థునులకు మంత్రి సీతక్క కుమారుడు సూర్య చేయూతనందించారు. కోడి శాశంక, ఆలం శ్వేత నిరుపేదకు చెందిన వారు కావడంతో వారికి కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.25వేలను అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తెలిపారు. విద్యార్థులు నీట్‌లలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ(బీఎస్సీ బీఈడీ)లలో పుందుచేరి, జలందర్ రాష్ట్రాల్లో సీట్లు పొందారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు ఎండి ఖలీల్, గుండ్ల దేవేందర్, వావిలాల నర్సింగరావు, గౌస్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం


ఏటూరునాగారం: ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: కన్నాయిగూడేనికి చెందిన బొమ్మారాజు శివాజీ రాజస్థాన్ జైపూర్లో జరిగిన జూనియర్ నేషనల్ తెలంగాణ హ్యాండ్ బాల్ టీం నుంచి పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ఇండియన్ హ్యాండ్ బాల్ టీంకి ఎంపికయ్యాడు. దీంతో క్రీడాకారుడికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రూ.25వేల నగదును నాయకుల చేతుల మీద మండల కేంద్రంలో శివాజీకి అందజేయాలని కోచ్ పర్వతాల కుమారస్వామికి గురువారం అప్పగించారు. పార్టీ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, నాయకుడు తాడూరి రఘు, తుమ్మ మల్లారెడ్డి, సప్పిడి రాంనర్సయ్య, ఎండి ఖాజా పాషా, భాస్కర్, చంద్రబాబు, ముత్తయ్య, బోజారావు, చిన్ని పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు బొమ్మరాజు శివాజీకి మండలంలోని ముప్పనపల్లి సహాయనిధి టీమ్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. హ్యాండ్ బాల్ పోటీల్లో త్వరలో అంతర్‌జాతీయంగా నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వెళ్లడానికి స్థోమత లేకపోవడంతో ఆర్థిక సాయం చేయాలని దాతలను కోరగా స్పందించిన సహాయనిధి టీమ్ సభ్యులు రూ.ఐదు వేలు అందజేశారు.

కమిటీ ఎన్నిక

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో గురువారం ఓడ బలిజ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ హాజరైయ్యారు. ఆయన సంమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బోల్లె సునీల్‌తో పాటు 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు అందజేశారు. మల్లికార్జునరావు, గగ్గురి రమేశ్, నాగర్జున, సాంబశివరావు, విజయ్ కుమార్, ముత్యాల రావు, సమ్మయ్య, శేఖర్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సోమలగడ్డ గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలెవరూ కూడా సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలకు మోసపోకూడదని అన్నారు. ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చినట్లు పార్ట్ టైం జాబ్ అంటూ, లోన్ ఆప్స్ అంటూ వివిధ రకాలుగా మోసం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కావున ఎట్టి పరిస్థితిల్లో కూడా ఎవరూ మోసపోకూడదు అని అన్నారు. ఎవరికి కూడా ఓటీపీ, బ్యాంక్ సంబంధిత వివరాలు చెప్పొద్దని అంతే కాకుండా ఎవరైనా సైబర్ నేరానికి గురి ఐతే వెంటనే 1930 నంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లేకుంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకులకుంట గొత్తికోయగూడెంను గురువారం ఎస్సై సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజలతో మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాల వల్ల వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారి ఆరోగ్యం గురించి ఇతరత్రా రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

హనుమాన్ ఆలయాన్ని ఢీకొట్టిన లారీ

- ధ్వంసమైన దేవుడి విగ్రహం


ధ్వంసమైన ఆంజనేయుడి ఆలయం, విగ్రహం

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని ఆంజనేయుడి ఆలయాన్ని గురువారం లారీ ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి.. 163 నంబర్ జాతీయ రహదారిపై నుంచి లారీలో ట్రాక్టర్లను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపునకు తీసుకు వెళ్తున్నారు. జగన్నాథపురం గ్రామం వద్దకు రాగానే జాతీయ రహదారి పక్కన ఉన్న ఆలయన్ని లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో రేకులతో వేసి ఆలయంతో పాటు ఆంజనేయుడి విగ్రహం ధ్వంసమైంది. లారీని ఆపకుండా వెళ్తుండటంతో జగన్నాథపురం యువకుడు లారీని ట్రేస్ చేసి మండల పరిధిలోని చీకుపల్లి గ్రామం వద్ద ఆపి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై హరీశ్

వాజేడు: ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు ఎస్సై రుద్రారపు హరీశ్ గురువారం అప్పగించారు. ముగ్గురు తమ ఫోన్లను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రేస్ చేసి పట్టుకున్నారు. వాటిని బాధితులకు అప్పగించడంతో పాటు ఫోన్లను ట్రేస్ చేసిన సిబ్బందిని అభినందించారు.

తరగతి గదుల ఏర్పాట్ల పరిశీలన


కళాశాలను పరిశీలిస్తున్న లెనినా

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల ఏర్పాట్లను గురువారం మండల ప్రత్యేక అధికారి లెనీనా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న కాలేజీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో ఉన్న నూతన భవనం, పాలెం వాగు ప్రాజెక్టు క్వార్టర్స్‌ను, దసిలి పట్టు పరిశ్రమ భవనంను పరిశీలించారు. వివరాలను ఫోన్‌లో కలెక్టర్ దివాకర దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని విధాలుగా అనుకూలంగా ఉండే విధంగా కాలేజీ నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ మీడియేట్ అధికారి పుల్లకాండ వెంకటేశ్వర్లు, కాలేజీ అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాస రాజు, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

భూసర్వేను అడ్డుకున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వీరస్వామి

మంగపేట: మండలంలోని కమలాపురంలో బిల్ట్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండగా భూమిని సాగుచేస్తున్న రైతులు గురువారం అడ్డుకున్నారు. దీంతో అధికారులకు రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయాన్ని సర్వే అధికారులు తహసీల్దార్ వీరస్వామి, ఎస్సై టీవీఆర్ సూరికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్, ఎస్సై రైతులతో మాట్లాడారు. కబ్జాలో ఉన్నంత మాత్రాన సర్వేను అడ్డుకోవద్దన్నారు. సర్వే నంబర్ 151, 298లోగల ప్రభుత్వ భూమి బిల్ట్ ఆధీనంలోనిదని రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. అదే భూమి మీకు చెందినట్లుగా ఏమైనా ఆధారాలు, పేపర్లు ఉంటే కలెక్టర్‌ను కలిసి పరిష్కరించుకోవాలని తప్ప సర్వేను అడ్డుకోవద్దన్నారు. తహసీల్దార్ చెప్పిన విధంగా రైతులు అడ్డు తప్పుకోవడంతో సర్వేను యథావిధిగా కొనసాగించారు.

కార్పొరేషన్ చైర్మన్లకు సన్మానం


శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రవియాదవ్

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎస్టీ కో ఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్‌గౌడ్, బెల్లయ్యనాయక్‌లు హైదరాబాద్‌లో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ హాజరై వారిని శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిని రాజుయాదవ్, కొనుపుల కుమార్, బొంత వేణు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న గోవింద్‌నాయక్

ములుగు రూరల్: మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన చెంచు రాజేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ గురువారం పరామర్శించి రూ.2 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట స్వామిరావు, కుమార్, లక్ష్మీనారాయణ, సదానందం, భిక్షపతి, నారాయణ తదితరులు ఉన్నారు.